క్లుప్తంగా

పాఠశాల సంసిద్ధత ఉత్సవం



సంసిద్ధత ఉత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): స్థానిక లంకపేట-1, -2 అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠశాల సంసిద్ధత ఉత్సవాన్ని సోమవారం నిర్వహించారు. శారీరక, మేధ, సాంఘిక అభివృద్ధుల గురించి ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ విజయలక్ష్మి తల్లిదండ్రులకు, పిల్లలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన డే నిర్వహించారు. సెక్టార్-1 సూపర్ వైజర్ బి.మంగ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ సేవలకు మై భారత్ వలంటీర్లు

ఏలూరు రూరల్ : దేశ సేవ కోసం యువత మై భారత్ డిఫెన్స్ వలంటీర్ల వ్యవస్థలో చేరాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యూత్ ఆఫీసర్ సుంకర రాము ఓ ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం మై భారత్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. సంక్షోభం సమయం దేశానికి సేవా చేసేందుకు బలమైన, స్వచ్ఛంద దళం రూపొందించడమే దీని ఉద్దేశమని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో ప్రభుత్వ అధికారులతో కలిసి జన సమూహ నియంత్రణ, ప్రజాభద్రత, విపత్తు సమయంలో సేవా కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గల యువత పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 94375 05290లో సంప్రదించాలని పేర్కొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ



క్రీడా పరికరాలు అందిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు రూరల్ : బాలబాలికలు వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొని మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. సోమవారం ఏలూరు ఇండోర్‌స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు క్రీడా పరికరాలు ఆయన చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల సాధన ద్వారా పిల్లలు మానసిక, శారీరక పటుత్వం పొందుతారని చెప్పారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామని, వీటికి క్రీడా పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. మే నెల 31 రోజుల పాటు బాలబాలికలకు బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, చెస్, స్విమ్మింగ్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ అందిస్తున్నామని వివరించారు. ఇందుకోసం డీఎస్ఏ శిక్షకులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులను నియమించామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ న్యాయ నిర్ణేత బడేటి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞానం.. వినోదం

- విజ్ఞానానికే కాదు వినోదానికి, శిక్షణకు వేదిక గ్రంథాలయం
- చిన్నారులకు వివిధ అంశాల్లో శిక్షణ
- గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి శిబిరాలు
- వైఎస్సార్ సీపీ హయాంలో నిర్ణయంతో స్వరూపం మారిన గ్రంథాలయాలు



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నృత్యం నేర్చుకుంటున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గ్రంథాలయాలు విజ్ఞాన గనులు అనేది ప్రతి ఒక్కరూ చెప్పే మాట. కానీ వాటి స్వరూపాలను మార్చడానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన వినూత్న కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. గ్రంథాలయాలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు మాత్రమే కాక భావితరాల చిన్నారులకు కూడా ఉపయోగపడాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లోనూ గ్రంథాలయాల్లో వేసవి సెలవుల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను ప్రారంభించింది. చిన్నారులకు విజ్ఞానాన్ని పంచుతూ, వారిలో నైతిక విలువలు పెంపొందిస్తూ, దేశంపై ప్రేమ, పెద్దలపై గౌరవ మర్యాదలు, వారి జీవితాలకు లక్ష్యాలు నిర్దేశించుకునేలా వారిని తీర్చిదిద్దుతూ శిబిరాలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. చిన్నారులకు అన్ని రంగాల్లో ప్రవేశం కల్పిస్తూ వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి వాటికి సాన పెడుతూ, వారికి తెలియని ఎన్నో కొత్త విషయాలను వారికి ఆసక్తికరంగా వివరిస్తూ రీసోర్స్ పర్సన్లు వారిని సుశిక్షితులను చేయడానికి తపిస్తున్నారు.

వివిధ అంశాల్లో శిక్షణ

వేసవి సెలవుల్లో చిన్నారులను విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దుతున్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాల్లో విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కలిగిస్తున్నారు. దేశ స్వాతంత్ర్య సమర యోధులు, దేశాభివృద్ధికి పాటుపడిన మహనీయుల జీవిత చరిత్రలు, కింది స్థాయి నుంచి ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారి విజయగాథలను వారికి వివరిస్తున్నారు. పురాణాలు, ఇతిహాసాలు, నీతి కథలను చదివిస్తూ వారికి భారతదేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని విశదీకరిస్తున్నారు. వీటితో పాటు సైన్స్, వేద గణితంలోని ప్రాథమిక అంశాలు, కథలు చెప్పడం, చిత్రలేఖనంలో మెళకువలు, శాస్త్రీయ, పాశ్చాత్య నృత్యాలు, ఏకపాత్రాభినయాలు వంటి అంశాల్లో కూడా శిక్షణ ఇస్తూ చిన్నారులకు బహుళ అంశాల్లో ప్రావీణ్యం కల్పిస్తున్నారు.



బాలల గ్రంథాలయంలో నృత్యం నేర్చుకుంటున్న విద్యార్థులు



మహిళా గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

కొనసాగుతున్న శిబిరాలు

ఏలూరు నగరంలో మూడు గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో జిల్లా కేంద్ర గ్రంథాలయం ప్రధానమైంది. కాగా స్థానిక 12 పంపుల సెంటర్‌లో మహిళల గ్రంథాలయం, అగ్రహారంలో బాలల గ్రంథాలయాలు ఉన్నాయి. ఈ గ్రంథాలయాలకు నిత్యం సుమారు వెయ్యి మంది పాఠకులు హాజరౌతుంటారు. వారితో పాటు నేటి తరాన్ని కూడా గ్రంథాలయాలకు వచ్చేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన ఈ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఏప్రిల్ 24 నుంచి ప్రారంభమైన విజ్ఞాన శిబిరాలు వచ్చే జూన్ నెల 6 వరకు కొనసాగనున్నాయి. శిబిరాలు ముగింపు సందర్భంగా ప్రతి చిన్నారికీ సర్టిఫికెట్, జ్ఞాపిక, బహుమతులు ఇవ్వనున్నారు.

రిసోర్స్ పర్సన్లు వీరే

విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి వివిధ రంగాలకు చెందిన పలువురు నిపుణులు ముందుకొచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డి.శ్రీవల్లి పేపర్ క్రాఫ్ట్, పెయింటింగ్, పి.శంకర్ డ్రాయింగ్, వై.ఫణికాంత్ నృత్యం, కె.తరుణ్ స్పోకెన్ ఇంగ్లిష్, గణితం, జి.శేషారత్నం కథలు చెప్పడం, పి.సంతోష కుమారి కథలు చెప్పడం, బీవీఎస్ లక్ష్మి యోగా, నాగాస్త్ర, ముస్తఫా అలి జనరల్ అంశాలకు రీసోర్స్ పర్సన్లుగా చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. బాలల గ్రంథాలయంలో ఎన్వీ గంగాభవాని, మ్యూజిక్, కారంశెట్టి రమేష్ బాబు నీతి కథలు, దాడి గంగాధరరావు పుస్తక పఠనం, కె.బృంద డ్యాన్స్, జి.పవన్ కుమార్ డ్రాయింగ్, క్యారమ్స్ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. మహిళా గ్రంథాలయంలో బి.హిమాచలేశ్వరి నీతి కథలు చెప్పడం, ఎం జగదీశ్వరి పుస్తకాల సమీక్ష, జి.సుబ్బలక్ష్మి స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పడం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

డ్యాన్స్ బాగా వస్తోంది



నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. సినిమా పాటలకు వచ్చీరాని డాన్స్ వేస్తూ ఉంటాను. ఇక్కడ డ్యాన్స్ టీచర్ డ్యాన్స్ తేలికగా చేయడం ఎలాగో నేర్పుతున్నారు. ఇప్పుడు డ్యాన్స్ బాగా వేయగలననే నమ్మకం ఏర్పడింది. నీతి కథల ద్వారా మనం ఎలా ఉండాలో, ఇతరుల నుంచి ఏం నేర్చుకోవాలో తెలుస్తోంది.

– పెండ్యాల సాయి సుహాస్, విద్యార్థి, 8వ తరగతి

కొత్త విషయాలు తెలుస్తున్నాయి



మా తరగతి పాఠాలు చదవడమే ఇప్పటి వరకు తెలిసేది. ఈ శిబిరానికి వచ్చాక కొత్త కొత్త విషయాలు తెలుస్తున్నాయి. చదువుతో పాటు బయట ఏం జరుగుతుందో, ఎలా జరుగుతుందో తెలుసుకుంటున్నాం. బొమ్మలు గీయడంలో మెళకువలు తెలిశాయి. ఇప్పుడు బొమ్మలు వేయడం తేలికగా అనిపిస్తోంది.

– జి.ఆదిత్యవర్ధన్, 8వ తరగతి విద్యార్థి

తెలియని విషయాలెన్నో



మన చరిత్ర, సంస్కృతి తెలుసుకుంటుంటే చాలా ఆసక్తిగా ఉంటోంది. మాకు తెలియని విషయాలు చాలా ఉన్నాయని ఇప్పుడే తెలుస్తోంది. తెలుసుకోవాల్సిన విషయాలు కూడా చాలా ఉన్నాయని అర్థమౌతుంది. ఈ శిబిరానికి రావడం వల్ల ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

– కంచర్ల ప్రియాంక, 9వ తరగతి విద్యార్థి

భయం పోయింది



ఎంత బాగా చదివినా పరీక్ష బాగా రాస్తానో లేదో అనే భయం ఉండేది. ఇక్కడకి వచ్చాక నలుగురిలో ఎలా ఉండాలి, చదువుపై ఎలా దృష్టి పెట్టాలి, చదివిన దానిని ఎలా గుర్తు పెట్టుకోవాలి, పరీక్షల్లో ఎలా రాయాలి అనే విషయాలు బాగా తెలిశాయి. ఇకపై పరీక్షలంటే భయం పోయి నాపై నాకు విశ్వాసం, నమ్మకం పెరిగింది.

– పిచ్చుక అక్షిత, 8వ తరగతి విద్యార్థిని

నైపుణ్యానికి పదును



చిన్నారుల్లో నైపుణ్యానికి కొదవలేదు. ఏది చెప్పినా ఇట్టే పట్టేస్తున్నారు. వారిలోని నైపుణ్యానికి మరింత పదును పెట్టి వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దడానికి ఈ శిబిరం చక్కని వేదికగా ఉపయోగపడుతోంది. తమ నైపుణ్యానికి సృజనాత్మక శక్తిని జోడించే విధంగా వారికి శిక్షణ ఇస్తున్నాం.

– పి.శంకర్, డ్రాయింగ్ టీచర్

తపన, ఉత్సాహం ఉన్నాయి



వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులకు వచ్చే విద్యార్థుల్లో కొత్త కొత్త అంశాలు నేర్చుకోవాలనే తపన, ఉత్సాహం కనిపిస్తున్నాయి. ఏ అంశంలో శిక్షణ ఇస్తున్నా, వారు ఎంతో ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. దీంతో రీసోర్స్ పర్సన్లలో కూడా వారిని ఉత్తమ నిపుణులుగా తీర్చిదిద్దాలనే అంకితభావం చూపుతున్నారు.

– శోభ మణిపురి, బాలల గ్రంథాలయం నిర్వాహకురాలు

చదువుతోనే ఉన్నత స్థానాలు



గ్రామ బాట కరపత్రం విడుదల చేసిన హరికృష్ణ, తదితరులు

ఏలూరు (టూటౌన్): పేదల స్థితిగతులను మార్చి, స్థాయిని పెంచేది చదువు ఒక్కటేనని అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్, రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పాలిమేర హరికృష్ణ అన్నారు. స్థానిక గన్ బజార్ సంఘ కార్యాలయంలో గ్రామ - బాట పేరుతో ముద్రించిన కరపత్రాన్ని హరికృష్ణ తదితర నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ గ్రామ బాట పేరుతో వివిధ దళితవాడల్లో విద్యా ఆవశ్యకతను వివరించి పాలేరు, కూలి వ్యవస్థకు దూరంగా చదువు దగ్గరగా దళిత చిన్నారులు ఉండే విధంగా చైతన్యం చేయనున్నట్టు చెప్పారు. పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులను కలిసి చదువు ఆవశ్యకతను తెలియజేసేందుకే గ్రామ బాట కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. రానున్న సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత దిశగా పరుగులు తీయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కాకాని వెంకటేశ్వరరావు, ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రమేష్, ప్రసాద్, శ్రీనివాస్, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీవారి రథోత్సవం

శ్రీవారి క్షేత్రంలో జరుగుతున్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారి రథోత్సవం కమనీయంగా నిర్వహించారు. క్షేత్ర పురవీధుల్లో స్వామి, అమ్మవార్లు ఊరేగారు. రథోత్సవ కార్యక్రమంలో కోలాట భజనలు, శక్తి వేషాలు, భక్తులను ఆద్యంతం అలరించాయి. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథోత్సవాన్ని ఆనందోత్సాహాలతో తిలకించారు.

– ద్వారకాతిరుమల



వేంకటేశ్వర స్వామి వేషధారణలో..



వివిధ వేషధారణలు



కోలాట నృత్యాలు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	బీన్సచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	54
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	32-38	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	38
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	112
క్యాబేజీ	20	అల్లం	56
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	22	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	18
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	15

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	07
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

ముగిసిన శ్రీవారి మహా కుంభాభిషేకాలు



మహాపూర్ణాహుతిలో పాల్గొన్న రామానుజ జీయర్ స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి 36వ నవాహ్నిక బ్రహ్మోత్సవ సహిత చతుర్వేద హవన ప్రయుక్త విమాన సుదర్శన కలశ ప్రతిష్టా మహా కుంభాభిషేకాలు సోమవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజు కార్యక్రమాల్లో శ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి పాల్గొన్నారు. ఉదయం శ్రీ లక్ష్మీ నారాయణ హవనం, ఉత్సవ మహా పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, వైనతేయ ధ్వజావరోహణం, గరుడ ప్రసాద వితరణ, దేవతోద్వాసన, ద్వాదశ ప్రదక్షిణాలు, ద్వాదశ ఆరాధన, శ్రీ పుష్పయాగం, నీరాజన మంత్రపుష్పాలు, మహదాశీర్వచనం, దంపత్తాంబూలాలు, అనంతరం స్వామి వారి పవళింపు సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పర్యవేక్షణలో యాజ్ఞిక బ్రహ్మలు జీవీవీ దీక్షిత్ స్వామి, కిళాంబి వేంకట పవన్ కృష్ణమాచార్యులు విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి కార్యక్రమాలు పర్యవేక్షించారు.

14 నుంచి 16 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి : మండలంలోని పెదవేగి విజయరాయి సెక్షన్ జానంపేట సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న జానంపేట, జగన్నాథపురం, సింగవరం, మూత్తనవీడు, గ్రామాలకు మరమ్మతుల నిమిత్తం ఈనెల 14 బుధవారం నుంచి 16 శుక్రవారం ఉదయం 7గంటల నుండి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే ఎం అంబేడ్కర్ చెప్పారు. కావున వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా ఆయన కోరారు.

సమ్మె విజయవంతానికి పిలుపు



రాయన్నపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నేత రామకృష్ణ

పెదవేగి : ఈనెల 20న జరిగే దేశవ్యాప్తను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెదవేగి మండలం పెదవేగి, రాయన్నపాలెం గ్రామలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశాల దగ్గర కార్మిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని మోసపూరిత వాగ్దానాలు అమలు చేసిందని విమర్శించారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా ఉపాధి హామీ కూలీలకు రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలి కోరారు. జాబ్‌కార్డు లేని కుటుంబాలకు కొత్తజాబ్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు రేటు కల్పించాలని, ప్రభుత్వ మార్కెట్ సౌకర్యం కల్పించి కొనుగోలు చేయాలని, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. మేధావులు, కార్మిక, కర్షక, ఉద్యోగ, కళాకారులు, విద్యార్థులు, యువత, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొని మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను ఉపాధి కూలీల పనులు బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆస్కార అప్పలస్వామి, చంటి, చౌరి కూలీలు పాల్గొన్నారు.

గిరిజన రైతుల అభివృద్ధికి కృషి

బుట్టాయగూడెం: పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని కేఆర్‌పురం ఐటీడీఏ ఉద్యాన శాఖ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గిరిజన వికాస్ సంస్థ సహకారంతో పోడు భూముల్లో చిరు ధాన్యాల సాగు చేపట్టే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఐటీడీఏ పరిధిలో సుమారు 1000 ఎకరాల్లో సుమారు 1000 మంది గిరిజన రైతులు పలు చిరు ధాన్యాల పంటలు వేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉద్యానశాఖ ద్వారా సుమారు 47.14 లక్షల వ్యయంతో 310 మంది రైతులకు వ్యవసాయంలో శిక్షణ ఇవ్వడంతో పాటు తైవాన్ స్ప్రేలను కూడా ట్రైకార్ చైర్మన్ చేతుల మీదుగా పంపిణీ చేశామన్నారు. తేనె పరిశ్రమలు ఏర్పాటుకు సంబంధించి కూడా కృషి చేశామని చెప్పారు. సుమారు 310 మంది లబ్ధిదారులకు వారి జీవనోపాధికి ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేశామని తెలిపారు.

కనకదుర్గకు లక్ష మల్లెల పూజ





బావిశెట్టి వారి పేట కనకదుర్గాంబ, అమ్మవారికి లక్ష మల్లెల పూజ చేస్తున్న సువాసినీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పత్తేబాద శ్రీ కనకదుర్గ దేవస్థానంలో వైశాఖ మాసం పౌర్ణమి పర్వదినం సందర్భంగా అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సుహాసిని కుసుమాలచే లక్షమల్లెల పూజ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నాయుడు సోము, శారద (దంపతులు), పృధ్వీ సత్యనారాయణ, పోలినాటి సత్తిరెడ్డి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

బావిశెట్టి వారి పేటలో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక బావిశెట్టి వారిపేట శ్రీ కనకదుర్గాంబ అమ్మవారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవ, పుష్పయాగ మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి సోమవారం ఉదయం లక్ష మల్లెల పూజ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద సహస్ర జ్యోతిర్లింగార్చన, రాత్రి దర్బారు సేవ నిర్వహించారు.